"పట్టపగలే పెళ్లాంతో సరసాలేమిట్రా భడవా...? దేనికైనా కాస్తంత చాటు మాటు అవసరం! తలుపేసుకుని ఏడవండి..." సుతిమెత్తగా వడ్డించింది బామ్మ.

"నీకు వయసు మీదపడినా ఇసుమంతైనా చూపుతగ్గలేదే బామ్మా! అద్సరేగానీ నాకు తెలీక అడుగుతా... పాపాయి తాళికట్టించుకున్న భార్య. అలాంటప్పుడు తప్పేంటి? పక్కింటోడి పెళ్లాంతో నేనేం సరసమాడటం లేదుకదా... మధ్యలో నీకేంటిట బాధ?" కాస్తంత హాస్యాన్ని మేళవించి ఘాటుగానే జవాబిచ్చాడు చంటి.

చంటి బామ్మగారి మనవడు. గారాలపట్టి.

"కొంపదీసి ఆ పనిగాని చేసేవ్. పక్కింటి పిల్ల మొగుడు పోలీసోడు. వెధవ్వేషాలేస్తే మక్కెలిరగ్గొడతాడు."

బామ్మ మాటలు తిట్లో దీవెనలో అర్ధమై చావలేదు చంటికి.

"ఇదిగో పిల్లా...వేళాపాళా లేకుండా మంచమెక్కావంటే నాక్కోపమొస్తుంది. ఎంత కొత్తగా పెళ్లయిన జంటయినా విరగబాటు పనికి రాదు."

బామ్మగారి భాగోతం

బామ్మగారి మాటలు చురుక్కుమనడంతో చంటి పక్కనే పందిరిమంచం మీదున్న పాపాయి పక్కకు జరిగి దిగబోతుంటే పైటపుచ్చుకుని మీదికి లాక్కొన్నాడు.

“అబ్బ! ఉండండీ...” అంటూ గోముగా గింజుకుంది పాపాయి. “మీకు అంతా తొందరే. ఉండండి తలుపేసి వస్తా... అవతల పెద్దావిడ చూస్తోంది...” అంటూ మంచం దిగొచ్చి గది తలుపేసి గడియ పెట్టింది పాపాయి.

వయసొచ్చిన పిల్లాడు ఎక్కడ చెడిపోతాడోనని ‘లా’ పూర్తికాగానే చంటికి పెళ్లిచేసి, తన బాధ్యత తీర్చుకుంది బామ్మ. అప్పుడే పెళ్లి దేనికని చంటి నెత్తీనోరూ మొత్తుకున్నా ససేమిరా విన్లేదు. పెళ్లి చేసుకోవాల్సిందే... తన కళ్ల ఎధుట వుండాల్సిందే అని శాసించింది. కాస్తంత మెత్తబడిన చంటి బామ్మ మాట జవ దాటలేకపోయాడు.

బామ్మంటే చాలా ప్రేమ చంటికి. పసితనం నుంచీ కంటికి రెప్పలా పెంచి తనను సాకింది. తల్లీతండ్రి లేని లోటు తీర్చింది. చదివించింది.

“ఇదిగో పాపాయ్! నా మనుమడికి కాఫీలు, టీలూ ఇచ్చేవుగనక... వాడి ఆరోగ్యం అటకెక్కుతుంది. పెళ్లి అయ్యేదాకా మనవడికి ముప్పొద్దులా మాదాకవళమే పెడుతున్నా – అర్థమైందా? అంతగా కావాలంటే నేతిగారెలు... ఆవిరి కుడుములు చేసిపెట్టు. నువ్వు నీళ్లోసుకునే నాటికి నా మనుమడు రుబ్బురోల్లా తయారవాలి. తెల్సిందా?” చాటలో ఉన్న బియ్యంలో రాళ్లేరుతున్న బామ్మ ఎదురుగా కూర్చున్న పాపాయితో అంది.

బామ్మ చెప్పే మాటలు శ్రద్ధగా వింటూ మరబొమ్మలా తలాడించింది. బదులు చెప్పడానికి ధైర్యంచాల్లేదు. బామ్మ మాట్లాడే ప్రతి మాటా... బెత్తంతో వీపుమీద చురకేసినట్టుంటుంది.

“నా వంటికి వరన్నం పడిచావదు. తెల్ల జొన్నలు పనివాళ్లతో దంపించి ఉడకేసిపెట్టు చాలు” ఉలుకూ పలుకూ లేకుండా ఎదురుగా కూర్చున్న పాపాయి ముఖంలోకి చూస్తూ మాట్లాడింది బామ్మ.

అందుకే కాబోలు ఎనభయ్యోపడిలో కూడా పిడిరాయిలా ఆరోగ్యంగా ఉంది బామ్మ అనుకుంది పాపాయి.

అక్కడి నుంచి లేచివెళ్లేందుకు ధైర్యం చాలడంలేదు. మరోవైపు చంటి తనను రమ్మంటూ పిలుపు. అడకత్తెర్లో పోకచెక్కలా ఉంది పాపాయి పరిస్థితి.

ఆలస్యానికి తాళలేక గబగబా బెడ్‌రూమ్‌లోనుంచి వచ్చి “అయిందా నీ ‘తాషామరపా’ వాయింపు. అసలే నువ్వంటే బెదిరి చస్తోంది. నోరు విప్పలేకపోతోంది పాపాయి. ఇవాల్టికి దాన్నొదిలెయ్. నువ్వురావే...” అంటూ పెళ్లాన్ని చేయిపుచ్చుకు గదిలోకి బరబరా ఈడ్చుకెళ్లినంత

యస్. వివేకానంద

పన్నేసాడు చంటి.

హఠాత్పరిణామానికి అవాక్కయింది బామ్మ.

★ ★ ★

షర్ట్ తగిలించుకుని లుంగీతో వీధిలోకెళ్ల బోతున్న చంటిని చూస్తూ "సూరీడు నడినెత్తికొచ్చాడు. ఇప్పుడెక్కడికిరా?..." నిలదీసినట్లడిగింది చంటిని.

నోరు పెగల్లేదు చంటికి.

"నాకు తెల్సులే. ఏ బీడీముక్కో తగలేసి రావడానికై ఉంటుంది. ఆ మాత్రం తెల్సుకోలేనను కున్నావా? చూడూ! సిగరెట్లు ఊదీ ఊదీ కేన్స రొచ్చి మీ నాన్న 'హరీ' అన్నాడు. నువ్వట్టాంటి వెధవపన్లు చెయ్యొద్దు. అర్థమైందా?" చంటి ముఖంలోకి చూస్తూ గద్దించి గుడ్లురుమింది.

అసలు తనకు స్మోకింగ్ అలవాటు లేదు. బామ్మదంతా అనవసరపు అపోహ. తిరిగి బదులిస్తే మీదపడి రక్కేస్తుందన్పించి సైలెంట్ అయిపోయాడు.

"వంటైపోయింది. మరో పది నిముషాల్లో ఇద్దరికీ వడ్డించేస్తాను. దొడ్లోకెళ్లి కాళ్లుకడుక్కరండి..." అనేసి వంటింట్లోకి నడిచింది.

చంటి కాళ్లకు బ్రేకులు పడడంతో వీధిలోకెళ్లే పని విరమించుకుని భార్యని భోజనానికి రమ్మని చేయిపుచ్చుకురావడానికి గదిలోకెళ్లాడు.

చంటి, పాపాయీ వచ్చి పీటల మీద కూర్చునే సమయానికే... కందిపచ్చడి, కొత్త ఆవకాయ, బంగాళాదుంప వేపుడుతో కంచాల్లో పదార్థాలు సాక్షాత్కరించినయ్.

చంటి కందిపచ్చడి వేడివేడి అన్నంలో కలిపి మధ్య మధ్య ఆవకాయ నాలిక్కి రాసుకుంటూ ముద్దమీద ముద్ద లాగించడం చూస్తున్న పాపాయి విస్తుపోయి మొగుడివంకే చూస్తోంది.

"ఏమిటా చూపు?... దిష్టి తగిలేను. ఇష్టమైన పదార్థాన్ని కలుపుకుని ఆబగా తినడం చంటికి అలవాటు. రోజూ కందిపచ్చడి రుబ్బి కంచంలో వేసినా కాదనడు. అదంటే వాటికి అంత ఇష్టం. ఆవకాయ, బంగాళాదుంప వేపుడంటే ప్రాణం! నీ మొగుడి ఇష్టాఇష్టాలు తెల్సుకుంటూ ఉండు. రేపు నేను 'హరీ' అంటే... అన్నీ సమర్థించుకోవలసిందానివి నువ్వే..." అంది బామ్మ.

పాపాయి చేతివేళ్లు కంచంలో ఆడడం గమనించిన బామ్మ "ఇదిగో పిల్లా! సుకుమారంగా అలా వేళ్లు ఆడిస్తావేంటి కంచంలో? పచ్చడి కలుపుకో... నెయ్యి వడ్డిస్తాను. కడుపునిండా తినడం నేర్చుకో!... ఊ... కానీ..."

బామ్మ మాటల్లో గదమాయింపు మాత్రమే కాక అంతకు మించిన ఆత్మీయత చోటుచేసుకున్న సంగతి పాపాయి గ్రహించింది.

చదువు లేకపోయినా బామ్మకా దేవుడు బోల్డన్ని తెలివితేటలిచ్చాడు. పంటపొలాలు... ఆస్తిపాస్తుల వ్యవహారాలన్నిటినీ బామ్మ మేనేజ్ చేయగలుగుతున్నదంటే మామూలు విషయం కాదు.

డబ్బు వడ్డీలకి తిప్పుతుంది. వస్తువులు కుదవపెట్టుకుని అప్పులిస్తుంది. పేదవాళ్లను కుంటే ఉచితంగా సహాయం చేస్తుంది. బామ్మలో మంచీ చెడు, దేవుడు - భక్తి, పూజ - పునస్కారం అన్నీ ఉన్నాయ్.

కొడుకు, కోడలూ ఏడాది తేడాతో కన్నుమూసారు. భర్త చిన్ననాడే పోయాడు.

తాను వంటరి మనిషిననే వాస్తవాన్ని గుర్తిం



చి, అప్పటినుంచీ అన్నిపన్లూ చక్కదిద్దుకురావడం ఆమె తెలివికి తార్కాణం.

చంటికేలోటూ రానీలేదు. ఏది కోరితే అది ఇచ్చింది. చదువు చెప్పించి ఓ ఇంటివాడిని చేసింది.

ఆమె కోరికల్లా... తాను కళ్లుమూసేవరకూ మనవడు తన ఇంట్లోనే ఉంటూ తన కళ్లఎదుటే తిరగాడాలి. చంటి చేతిలో తాను కన్నుమూయాలి. అంతకు మించిన కోరికలేమీ బామ్మలో లేవు.

లంకంత పెంకుటిల్లు. ఓ కలర్ టీవీ., సిటీకెళ్లి చదువుకొనేందుకు స్కూటర్ చంటికి కొనిచ్చింది.

ఇన్ని చేసిన బామ్మ... చంటి సిటీలో లాయర్ ప్రాక్టీస్ చేస్తానంటే మాత్రం సుతరామూ వప్పుకోలేదు. మనుమడు తనకు ఎక్కడ దూరమైపోతాడోననే బెంగ!

ఎన్నో ఏళ్లుగా ఉంటున్న ఇంటిని, సిరిసంపదలున్న ఊరినీ వదిలి వెళ్లడానికి బామ్మకి బొత్తిగా మనస్కరించదు.

పళ్లూడలేదు, చూపు మందగించలేదు, నడుము వంగలేదు. ఆమె ఆరోగ్యం చూసి ఎదుటివాళ్లు ఈర్ష్యపడతారు.

పాపాయి కొత్తగా కాపురానికి రాగానే విషయాలన్నీ పూసగుచ్చినట్లు చెప్పింది. కందిపొడి, ధనియాలపొడి, కొబ్బరిపొడి, కారప్పొడి అన్నా... వేపుడు కూరలన్నా... ముద్దపప్పన్నా చంటికెంతో ఇష్టమని చెప్పింది.

బామ్మ అనుభవాలు ఓ పేద్ద నిఘంటువు. ఇన్నేళ్లొచ్చినా స్నానంచేసి మడిబట్ట ధరించి, దేవుడికి దీపారాధన చేసి నైవేద్యం పెట్టాల్సిందే. ఆ తర్వాతే ఏ పనైనా!

'ఎత చకని సుతుడే యశోదపుతుడు... కాతలార గాచివతమురడు...' అంటూ రాగాలా

పనతో బామ్మ పాడేపాట అర్ధంకాక చంటి నడిగింది పాపాయి.

పేద్దగా నవ్విన చంటి "నీకేంటీ... చిన్నప్పుడు నాకూ అర్ధంకాక తల బద్దలుకొట్టుకునేవాడిని. తర్వాత గ్రహించాను ఆ పాట తీరేమిటో..." అన్నాడు.

"అబ్బ! సస్పెన్స్‌తో చంపక... అదేమిటో త్వరగా చెప్పండీ ..." గోముగా అడిగింది.

"ఎంత చక్కని సుతుడే యశోదపుత్రుడు... కాంతలార కాంచివత్తమురండి..." అనేది అసలు పాటకున్న చరణం. బామ్మకి వత్తులు... పొల్లులు... దీర్ఘాల వంటివి తెలీవు కాబట్టి నోటికొచ్చినట్లు పాడేయడం అలవాటైంది. అండర్‌స్టాండ్!..." విపులీకరించాడు చంటి.

సమాధానం విన్న పాపాయి పకపకా నవ్వింది.

ఇంట్లో సర్వాధికారాలూ బామ్మవే! పెత్తనమంతా ఆవిడదే. ఆమె గీచిన గీటు దాటడు చంటి. పిసినారి కాకపోయినా డబ్బు విషయంలో గట్టిమనిషి! మనిషిలో పట్టుదల అధికం. పాపాయి బాధల్లా తనకా ఇంట్లో ఫ్రీడమ్ లేకుండా పోతోందేనని. నచ్చినా నచ్చకపోయినా సర్దుకుపోక తప్పడంలేదు.

పల్లెటూర్లో ఇరవైనాలుగ్గంటలూ ఇంటికే అంకితమైపోవాలంటే పాపాయికి బోరన్పిస్తోంది. ఎంతసేపని టీవీ చూస్తుంది? అప్పటికీ తనకోసమని సిటీ నుంచి న్యూస్‌పేపర్... వీక్లీలూ తెప్పిస్తున్నాడు చంటి. అయినా ఏదో అసంతృప్తి పాపాయిని వెంటాడుతోంది. హౌస్ అరెస్టులా ఉంది.

మధ్యాహ్నం భోజనాలయ్యేక చంటి, పాపాయీ బెడ్‌రూమ్‌లోకెళ్లి విశ్రాంతి తీసుకుంటున్నారు.

బామ్మ ఆ పనీ ఈ పనీ చేస్తూ ఉండిపోయింది.

రెండు గంటల సమయంలో బామ్మకేం గుర్తొచ్చిందో ఏమో... చంటినీ, పాపాయినీ కేకేసి పిలిచింది.

వాళ్లిద్దరూ వచ్చి దగ్గరగా నిలబడగానే "మీ ఇద్దరికీ ఓ ముఖ్యమైన విషయం చెప్పాలన్పించి పిల్చాను. ఈ రోజు పాడ్యమి. వర్జ్యంలేదు. కాబట్టి..."

"ఇప్పుడీ సోదం కా దేనికే బామ్మా?" వీపు గోక్కుంటూ నొసలు చిట్లించి నిద్ర చెడిపోయిందేనన్న విసుగుతో అన్నాడు చంటి.

"పిచ్చి సన్నాసీ!... చదువైంది. పెళ్లీ చేసుకున్నావ్. ఇక ఈ ఇంటి పెత్తనం నాకు దేనికి? నువ్వూ పాపాయీ చేసుకోండి. నేను కృష్ణా - రామా అనుకుంటూ వుంటాను..."

ఆ మాట వినగానే బిత్తరపోయిన చంటి, పాపాయి ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు.

ఇనప్పెట్టె తాళాల గుత్తి పాపాయికి అందిస్తూ "దీన్ని తెరవ్వే మనమరాలా..." అంది బామ్మ.

ఎంత ప్రయత్నించినా దాన్ని తెరవడం పాపాయికి చేతకాలేదు. చంటి కూడా ప్రయత్నించి ఫేలైనాడు.

"మీకు అన్నీ తెలుసనుకుంటారు. ఇనప్పెట్టె తెరవలేకపోయారు..." అంటూ నవ్వేసి "ఇదిగో ఇలా తెరవాలి..." అంటూ ఇనప్పెట్టె డోర్ ఓపెన్ చేసింది.

బంగారం... వెండి... నగానట్రా... నోట్ల



కట్టలు... ప్రాంసరీ నోట్లతో కిక్కిరిసి ఉండడం చూసి పాపాయి నోరెళ్లబెట్టింది.

ఇప్పుడిదంతా దేనికి అన్నట్టు బామ్మ ముఖంలోకి చూసేడు చంటి.

"ఇకపై ఇంటి మేనేజ్‌మెంటు... ఇనప్పెట్టె మేనేజ్‌మెంటూ అంతా మీదే!... ఆ తర్వాత మీ యిష్టం!!" క్లుప్తంగా చెప్పి తాళాలు పాపాయి గుప్పిట్లో ఉంచింది బామ్మ.

పాపాయి గుడ్లు మిటకరించింది.

ఇంతలో పాలేరు పోలయ్య వచ్చి "అమ్మగారూ... అబ్బాయిగోరికి ఉత్తరమొచ్చింది" అంటూ అందించి వెళ్లాడు.

చంటి అందుకుని చదివేడు.

"ఎక్కడ్నించిరా అది" బామ్మ అడిగింది.

"పండక్కి రమ్మని మామగారు వ్రాసారే..."

"అవును కదూ? ఎల్లుండే సంక్రాంతి... ఇంకేం ఉభయులూ బయల్దేరండి..." అంటూ ఇనప్పెట్టె తాళం పాపాయిని వేయమని చెప్పింది బామ్మ.

★ ★ ★

"సారీ అల్లుడూ... నువ్వొచ్చి ఇరవైనాలుగ్గంటలైనా కాకముందే బేడ్‌న్యూస్... నువ్వూ అమ్మాయీ వెంటనే బయల్దేరండి! ఆటో కూడా తెప్పించాను. ఊ... క్విక్..." వెంకట్రామయ్యగారు తన చేతిలో ఉన్న టెలిగ్రామ్‌ని చంటికి అందించారు.

"ఏంటి మామయ్యగారూ... ఎందుకూ తెగ ఫీలైపోతున్నారు" అంటూ టెలిగ్రామ్ చదివాడు.

"వాట్?... బామ్మ చనిపోయిందా?... నో... ఐ కాంట్ బిలీవ్ మామయ్యగారూ..." మేటర్ చదివి నిర్ఘాంతపోయాడు.

"చూడు అల్లుడూ... మనుషుల్ని వున్నపళంగా లాక్కెళ్లిపోతాడా దేవుడు. అందులోనూ

వయస్సు మళ్లినావిడ... లాస్ట్‌బస్ మిస్సయితే మీ ఊరు చేరుకోవడం కష్టం. రెడీ అవండి త్వరగా..." తొందరచేసేరు వెంకట్రామయ్య గారు.

'బామ్మ చనిపోవడమేమిటి? హే భగవాన్... నాకున్న ఒకే ఒక్క పెద్దదిక్కును దూరం చేసావా?...' గొణిగేడు చంటి.

ఆటోలో ఆఘమేఘాలమీద బస్టాండ్ చేరుకున్నారు. ప్లాట్‌ఫారమ్ మీద బస్ రెడీగా ఉంది. వడివడిగా నడుచుకుంటూ వచ్చి బస్సెక్కారు పాపాయి, చంటి.

బామ్మ చనిపోయిందనే వార్త చంటిలో క్షణక్షణానికీ ఆవేదన్ను పెంచుతోంది. పసిపిల్లవాడిలా ఏడుస్తున్నాడు. కర్చీఫ్‌తో కళ్లొత్తుకుంటున్నాడు.

బస్ బయల్దేరింది.

ఇంత సడన్‌గా బామ్మ పోవడమేమిటి? సెంచరీ కొడుతుందనుకున్న బామ్మ... చచ్చిపోవడమా? మనసంతా గందరగోళంగా ఉంది. పక్కనున్న పాపాయి చంటిని ఓదార్చే ప్రయత్నంలో ఉంది.

బస్సు దిగిన చంటి, పాపాయి పరుగులాంటి నడకతో ఇల్లు చేరుకున్నారు.

ఇంటి ముందు ఎవ్వరూ అవుపించకపోవడంతో మరింత ఆదుర్దా, కంగారూ చంటిలో మొదలయ్యాయి.

కనీసం చివరి చూపైనా దక్కలేదా తనకు? దహన సంస్కారాలు చేయవలసిన తాను రాక ముందే... అంతా అయిపోవడమేమిటి?

ఇంట్లోకి భార్యాభర్తలిద్దరూ నిర్లిప్తంగా నడిచారు.

మంచంమీద వెల్లకిలా పడుకున్న బామ్మ నిశ్చలంగా నిద్రపోతున్నట్టనిపించింది. కళ్లు మూసుకు పడుకున్న బామ్మని చూస్తుంటే... ఆమె చనిపోయిందంటే నమ్మబుద్ధి కాలేదు చంటికి. కేవలం బామ్మ నిద్రపోతున్నట్టుగా ఉంది.

బామ్మ కళ్లుతెరిచి లేచి కూర్చుని "నాకు తెలుసు మీరొస్తారని..." అనడంతో చంటి, పాపాయి అదిరిపడ్డారు.

చనిపోయిందనుకున్న బామ్మ ఎలా బ్రతికింది? ఏమిటీ తమాషా? నివ్వెరపోయాడు చంటి.

"కంగారు పడకండ్రా! నేనే తంతి ఇప్పించాను"

"చావుతో చెలగాటాలేంటే బామ్మా..." తనూ బామ్మ పక్కనే మంచంమీద కూర్చుంటూ కోపంగా అన్నాడు చంటి.

"మరేం లేదురా అబ్బీ!... కాకులు క్రీడించడం చూసాను. అలా చూట్టం అరిష్టం కదా. చూసినవారు చనిపోయినట్టు వార్త అయిన వారికి తెలియజేస్తే... వారు ఏడిస్తే దోషపరిహారమవుతుంది. అందుకే మీకలా తంతి ఇచ్చి రప్పించాను..." అనేసి పెద్దపెట్టున నవ్వింది బామ్మ.

"ఓసి బామ్మా!... నీ 'కాకి చూపు' వెనకాల ఇంత కథుందా!? నువ్వు నిజంగానే పోయావనుకుని బెంగపడ్డాం! నీ మూఢాచారం నాశనమైపోనూ... ఇంకెప్పుడూ ఇలాంటి వెధవపన్లు చెయ్యకు... మా చావుకొస్తుంది..." అంటూ బామ్మకు మెత్తగా చీవాట్లు పెట్టేడు చంటి.

బామ్మ బిక్కముఖం పెట్టింది... పాపాయేమో భర్త మాటలకి ఫక్కున నవ్వింది. ●